# గణాంక సర్వేలకు ఆద్యుడు మహలనోబిస్



**సామాన్యులు ఈ రోజు గురించి ఆలోచిస్తే... దార్శనికులు, మేధావులు.. రాబోయే తరాల గురించి ఆలోచిస్తారట! అలా ఆలోచించగలిగిన వాళ్లే భావితరాలకు మార్గనిర్దేశం చేస్తారు.. దూరదృష్టితో ఆలోచించి, సమాజానికి మేలు చేసే వ్యవస్థలు, సంస్థల ఏర్పాటుకు నాందిపలుకుతారు. భారతదేశం అభివృద్ధి బాట పట్టాలంటే... భారీ పరిశ్రమలకు శ్రీకారం చుట్టాలని నొక్కిచెప్పిన ప్రముఖ ఆర్థికవేత్త... ప్రసన్న చంద్ర మహలనోబిస్. ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్(ఐఎస్ఐ), నేషనల్ శాం పిల్ సర్వే (ఎన్ఎస్ఎస్), సెంట్రల్ స్టాటిస్టికల్ ఆర్గనైజేషన్ వంటి సంస్థల స్థాపన ఆయన దార్శనికతకు నిదర్శనం!!**

భారత్‌లో పంచవర్ష ప్రణాళికల ప్రస్తావన వస్తే... తప్పనిసరిగా గుర్తుకువచ్చే పేర్లు.. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నె హ్రూ..ప్రముఖ ఆర్థికవేత్త ప్రసన్నచంద్ర మహలనోబిస్. రెండో పంచవర్ష ప్రణాళిక ముసాయిదాను.. 1955లో జాతీయ అభివృద్ధి మండలి(ఎన్‌డీసీ)కిసమర్పించడంతో మహలనోబిస్ పేరు దేశవ్యాప్తంగా సుపరిచితమైంది. దేశాల మధ్య ఆదాయ అంతరాల్ని పరిశీలించి...స్టీల్ ఉత్పత్తి జరుగుతున్న దేశాల్లో ఆదాయం గణనీయంగా పెరిగిందని తేల్చిచెబుతూ... భారీ పరిశ్రమల స్థాపనకు నాంది పలకాలని ప్రభుత్వానికి సూచించారాయన! దాంతో భారీ పరిశ్రమలకు పెట్టుబడులు భారీగా పెరిగాయి. ఆయన సలహా దేశంలోని పలు ప్రాంతాల్లో స్టీల్ సిటీల స్థాపనకు శ్రీకారం చుట్టింది.

### కేబినెట్ సలహాదారుగా:

పంచవర్ష ప్రణాళికలకు సంబంధించి ఆయన ఆలోచనలు... ఆర్థికాభివృద్ధిపై నాడున్న అభిప్రాయాలకు అనుగుణంగానే ఉండేవి. స్వతంత్రభారత కేంద్ర కేబినెట్‌కు గణాంకాల సలహాదారునిగా... పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పనపై ప్రభుత్వానికి అనేక విలువైన సూచనలిచ్చారు. పారిశ్రామికాభివృద్ధిని పెంచడం ద్వారానే పేదరికాన్ని నిర్మూలించవచ్చనేది ఆయన నిశ్చితాభిప్రాయం.

### విద్యాధికుల కుటుంబం:

మహలనోబిస్... సామాజిక స్పృహ అధికంగా ఉన్న విద్యాధికుల కుటుంబంలో 1893, జూన్ 29న జన్మించారు. కోల్‌కతాలోని బ్రహ్మో బాలుర పాఠశాల, ప్రెసిడెన్సీ కాలేజీలో చదువుకున్నారు. అనంతరం ఆయన బ్రిటన్‌లోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో ఫిజిక్స్, మ్యాథమెటిక్స్‌లో పట్టా పొందారు. విదేశంలో విద్యాభ్యాసం పూర్తయ్యాక భారత్‌కు తిరిగివచ్చి... తాను చదువుకున్న ప్రెసిడెన్సీ కాలేజీలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా చేరారు. వాస్తవానికి ఆర్థిక, గణాంక శాస్త్రాలలో ఎలాంటి శిక్షణ పొందని మహలనోబిస్... ప్రముఖ ఆర్థికవేత్తగా పేరుగడించడం విశేషం!

## స్టాటిస్టికల్ మెథడ్స్‌పై ఆసక్తి:

ప్రెసిడెన్సీ కాలేజీలో పనిచేస్తున్న రోజుల్లో.. స్టాటిస్టికల్ మెథడ్స్‌పై మహలనోబిస్‌కు ఆసక్తిపెరిగింది. అత్యంత ఉత్సాహంతో వాటిని అధ్యయనం చేయడం ప్రారంభించారు. కాలేజీలో ఏకంగా స్టాటిస్టికల్ లేబొరేటరీని స్థాపించడం గణాంకాల పట్ల ఆయన ఆసక్తికి నిదర్శనం. గణాంకాలను పరిశీలించడం ద్వారా సమాజంలో సాంఘిక ఆర్థిక తారతమ్యాలను, మార్పు లనుగమనించడం ప్రారంభించారు. 1920 తొలినాళ్లల్లో ఆంగ్లో- ఇండియన్ వర్గం ప్రజలకు సంబంధించిన గణాంకాలను పరిశీలించడం ద్వారా.. ఆ వర్గంలో సంభవిస్తున్న సామాజిక మార్పులను విశ్లేషించారు. 1930లో బెంగాల్లో జనపనార ఉత్పత్తిని అంచనా వేయాల్సిందిగా.. కేంద్ర జనపనార కమిటీ మహలనోబిస్‌ను కోరింది. అందుకోసం ఆయన విస్తృతంగా సర్వేలు నిర్వహించారు. అది 1950లో ఎన్ఎస్ఎస్ తొలి రౌండ్ గణాంకాలకు దారి తీసింది. భారత్‌లో పేదరిక, జీవన ప్రమాణాలపై గణాంకాలకు ఎన్ఎస్ఎస్ సర్వేలు ప్రామాణికంగా మారిన సంగతి తెలిసిందే!

## సమాజం కోసం సర్వేలు:

భారత్‌లో పెద్దయెత్తున శాంపిల్ సర్వేలను ప్రవేశపెట్టిన ఘనత మహలనోబిస్‌దే! దాదాపు 80 శాతం మంది ప్రజలు గ్రామాల్లోనే నివసించే పరిస్థితి.. పైగా అత్యధికులు నిరక్ష రాస్యులే! రికార్డులు కూడా పెద్దగా అందుబాటులో లేవు. రోడ్డు రవాణా సౌకర్యాలు సరిగాలేవు.

అప్పుడే స్వాతంత్ర్యం సాధించిన దేశంలో విధాన నిర్ణేతల ముఖ్య లక్ష్యం పేదరిక నిర్మూలన! అందుకోసం సంక్షేమ కార్యక్ర మాలు చేపట్టాలంటే... పేదరికం, నిరుద్యోగం, ప్రజల జీవన ప్రమాణాలపై సరైన సమాచారం అవసరం. అలాంటి పరిస్థితు ల్లో మహలనోబిస్ ప్రతిపాదించిన పైలెట్ సర్వేలు, శాంప్లింగ్ మెథడ్స్.. అన్నిటికిమించి ఆయన నాయకత్వ ప్రతిభ, సేవలు మరువలేనవి! అయితే, కొంతమంది మేధావులు సమాజానికి చేసిన సేవలు, సాధించిన విజయాలు పెద్దగా ప్రచారం పొందవు.. మహలనోబిస్ విషయంలో అది నిజమని చెప్పొచ్చు!!